క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మరికల్/కృష్ణా/నర్వ/మాగనూర్: అన్నదాతలు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ భారతి పోర్టల్ నుంచి జూన్ 5 వరకు డిజిటల్ సంతకం చేసిన కొత్త పాసు పుస్తకాలు కలిగిన 18 నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన రైతులు ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. ఆయా గ్రామాల్లో సంబంధిత ఏఈఓలకు దరఖాస్తు ఫారాలను అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని కొత్త పాసు పుస్తకాలు కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెడ్డి సేవా సమితి సభ్యత్వ నమోదు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో రెడ్డి సేవా సమితి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సేవా సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వెనకబడిన పేద సామాజిక రెడ్డి బంధువులకు చేయూతనివ్వాలని, ఈడబ్ల్యూఎస్‌పై కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మధుసుధన్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, అన్నాసారం అనంత్ రెడ్డి, బాల్‌రెడ్డి, భీం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాగర్జనను విజయవంతం చేయండి

కృష్ణా: రాష్ట్ర రాజధానిలో ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు బోడి తేజ కోరారు. శనివారం మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ పెంచాలంటూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాలను వివరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మహేందర్, అధికార ప్రతినిధిగా తిమ్మప్ప, ఉపాధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా వై తిమ్మప్ప, కార్యదర్శిగా తాయప్ప, కోశాధికారిగా కిష్టప్పను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ



నారాయణపేట టౌన్: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు సేవా భారతి విభాగ్ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ 10 ఫ్యాన్లు అందజేశారు. పాఠశాలలో నూతన భవన నిర్మాణం చేపట్టడంతో విద్యార్థుల సౌకర్యార్థం ఫ్యాన్లను అందజేసినట్లు తెలిపారు. అదే విధంగా ఎక్లాస్‌పూర్‌లోని విద్యార్థులకు నిర్వహించిన ఆటపోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని శిశుమందిర్ పాఠశాల జిల్లా కార్యదర్శి సీతారాములు అన్నారు. కార్యక్రమాలలో నగర సంచాలక్ డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, సహాయక కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, మ్యాడం ప్రభాకర్, డా. కృష్ణారెడ్డి, ప్రధాన ఆచార్యులు దత్తు చౌదరి, పంతాజలి యోగా అధ్యక్షుడు సురేష్, హన్మంతు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో ఎద్దు మృతి



మాగనూర్: పిడుగుపాటుతో ఎద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అమ్మపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం అమ్మపల్లి గ్రామానికి చెందిన రైతు బాలప్ప పొలం దగ్గర రోజు మాదిరిగానే తన ఎద్దును పొలం దగ్గర కట్టేసి వెళ్లాడు. శనివారం ఉదయం కురుసిన భారీ వర్షానికి తోడు పిడుగు పడటంతో ఎద్దు మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ.60 ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

నేడు దేవరకద్రకు ఎంపీ రాక

దేవరకద్ర రూరల్: పాలమూరు ఎంపీ డీకే అరుణ ఆదివారం దేవరకద్రకు రానున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కందూరు రఘుపతిసాగర్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్మించిన రంగనాయకస్వామి ముఖద్వారాన్ని ఎంపీ ప్రారంభోత్సవం ఎంపీ చేయనున్నట్లు వివరించారు.



పేటలో రఘుబాబు సోదరులకు రాఖీ కడుతున్న సోదరి



డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరిమణులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సోదరుడికి రాఖీ కడుతున్న అక్కా



పేటలో నవదీప్‌కు రాఖీ కడుతున్న సోదరి మనస్వీ

అనురాగం.. అనుబంధం.. రక్షా బంధన్

- సోదరులకు రాఖీలు కట్టిన సోదరిమణులు
- ఆనందంగా సెల్ఫీలు దిగి సంబరాలు



పెదిరిపాడులో తమ్ముడు బద్రీనాథ్‌కు రాఖీ కట్టి సెల్ఫీ దిగుతున్న అక్కలు గాయత్రి, భూమిక

బంధాన్ని బలోపేతం చేస్తూ.. అనుబంధాల మాధుర్యాన్ని పెంచేలా 'సాక్షి' ఆధ్వర్యంలో చేపట్టిన 'సెల్ఫీ విత్ రాఖీ'కి అనూహ్య స్పందన లభించింది. సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి సెల్ఫీ తీసుకుని సంబరపడ్డారు.

\- నారాయణపేట



పేటలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న అక్కాతమ్ముళ్లు.. అన్నాచెల్లెల్లు



పేటలో ఉదయ్‌కిరణ్‌కు రాఖీ కడుతున్న సోదరి అక్షయ



పేటలో అభినవ్‌కు రాఖీ కడుతున్న సోదరి ఐశ్వర్య



పేటలో తమ్ముడు ఆశ్రిత్‌కు రాఖీ కడుతున్న అక్కా



పేటలో తమ్ముడు లఖన్‌కు రాఖీ కడుతున్న నేహా

వైభవంగా జగలింగేశ్వరస్వామి ఊరేగింపు

నారాయణపేట టౌన్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా గుట్టపై గల హంద్రిక జటలిగేశ్వర స్వామి జాతర ఉత్సవాలలో భాగంగా శనివారం పల్లకి ఊరేగింపుతో పాటు గొలుసు తెంపే కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవమూర్తి విగ్రహానికి మహా అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ సుధాకర్, పూజారి మల్లప్ప, కుర్వ సంఘం నాయకులు తిమ్మన్న, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.



పల్లకి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఘనంగా భక్త మార్కండేయస్వామి పలకీ సేవ



మరికల్‌లో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



మద్దూరులో స్వామి వారి పల్లకి ఊరేగింపు

నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లి, కోటకొండ గ్రామాల్లో శ్రావణ పౌర్ణమి సందర్భంగా పద్మశాలీ సేవ సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ స్వామి పల్లకి సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీధుల గుండా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

మరికల్: మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం భక్త మార్కండేయ స్వామి పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు. భాజభజంత్రీల మధ్య ఆలయం నుంచి గ్రామ పురవీధుల గుండా పల్లకి సేవ నిర్వహించగా గ్రామస్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

మద్దూరు: మద్దూరులో మార్కండేయ ఉత్సవాలను శనివారం మండల పద్మశాలీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి పల్లకిని ఊరేగించారు. కార్యక్రమంలో పద్మశాలీలు రాఘవేందర్, పురుషోత్తం, శ్రీనివాస్, ఎల్లప్ప, రామకృష్ణ, వెంకటేశ్, చంద్రమౌలి తదితరులు పాల్గొన్నారు.

నూలు పౌర్ణమి వేడుకలు

ధన్వాడ: మండల కేంద్రంలోని స్థానిక భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో శనివారం పద్మశాలీలు నూలు పౌర్ణమి సందర్భంగా మహా హోమం నిర్వహించారు. ఉదయం భక్తమార్కండేయ స్వామికి అభిషేకం నిర్వహించి, పల్లకిలో స్వామివారి విగ్రహంతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అలాగే ఎంతో పవిత్రంగా భావించే పాత జంధ్యం తీసి కొత్త జంధ్యం ధరించారు. స్వామివారికి మహా మంగళహారతి కార్యక్రమం నిర్వహించి ప్రసాద వితరణ చేశారు.

కనుల పండువగా ఆదిహన్మాన్ల రథోత్సవం



మరికల్: మండలంలో రెండు గ్రామాల మధ్య కొలువు దీరిన ఆదిహన్మన్ల కాశీ విశ్వనాథ కురుమూర్తి స్వామి రథోత్సవ వేడుకలను భక్తులు శనివారం కన్నుల పండువగా నిర్వహించుకున్నారు. మరికల్ నుంచి స్వామి వారి విగ్రహాలను పల్లకి సేవ ద్వారా ఊరేగింపుగా తీసుకెళ్లి జిన్నారం మరికల్ గ్రామాల మధ్య కొలువు దీరిన ఆదిహన్మన్ల ఆలయం దగ్గరకు రాగానే భజనలు చేస్తూ గోవిందనామ స్మరణంతో రథోత్సవం నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు.

చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు ప్రారంభం

మద్దూరు: పట్టణంలోని చౌడేశ్వరీ దేవాలయంలో శనివారం తొగుటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో చౌడేశ్వరీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు చెరువు నుంచి గంగాజలం ఉరేగింపు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. రెండో రోజు అఖండ జ్యోతుల ఊరేగింపు నిర్వహించడంతో పాటు ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహాదేవ్, విఠల్,బాల్‌రాజ్, రామకృష్ణ, రమేష్, రతేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాలయం.. ప్రారంభానికి సిద్ధం



ఆస్పత్రి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ (ఫైల్)

- రూ.1.20 కోట్లతో దవాఖాన నిర్మాణం
- మూడు నెలల్లో అందుబాటులోకి రానున్న ఆస్పత్రి

కృష్ణా: కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని కృష్ణా మండల కేంద్రంలో ఏర్పాటు కానున్న ప్రభుత్వ ఆస్పత్రి మరో మూడు నెలల్లో అందుబాటులోకి రానుంది. సరిహద్దు ప్రాంతం కావడంతో మెరుగైన వైద్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం రూ.1.20 కోట్లతో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం చేపట్టింది. అయితే ఈ దవాఖాన మరో మూడు నెలల్లో అందుబాటులోకి రానుండడంతో మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా మండలం కర్ణాటక సరిహద్దులో ఉండడం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఏ చిన్న జబ్బు చేసినా వైద్యసేవలకు కర్ణాటకలోని రాయచూర్‌లోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇక గర్భిణులు, బాలింతల పరిస్థితి వర్ణనాతీతంగా ఉండేది. ఏవైనా ప్రమాదాలు, విష జంతువుల కాటుకు గురైన సమయంలో అత్యవసర వైద్యసేవల కోసం దాదాపు 30 కిలోమీటర్ల దూరంలోని రాయచూర్ లేదా 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న మక్తల్‌కు వెళ్లాల్సిందే. పైగా ఈ ప్రాంతం నుంచి రవాణా సౌకర్యాలు కూడా అంతంతమాత్రమే కావడంతో చాలా మంది సరైన వైద్యం అందక ప్రాణాలు పోగుట్టుకున్న సందర్భాలు కోకొల్లలు ఉన్నాయి. ఈ విషయంపై గత కొంతకాలంగా తమకు మండల కేంద్రంలో ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేయడంతో ఆస్పత్రి నిర్మాణానికి రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం భవన నిర్మాణం పూర్తి కావొస్తుండడంతో తమ ఇబ్బందులు తొలగనున్నాయని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భవన నిర్మాణం వేగవంతం



మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం దాదాపు 70 శాతం పూర్తి కావడంతో ఇంకో మూడు నెలల్లోనే అందుబాటులోకి వస్తుందని కాంట్రాక్టర్ తెలిపాడు. కలెక్టర్ ఇటీవల ఆస్పత్రిని సందర్శించిన సమయంలో నిర్మాణ పనులు నాణ్యతగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు తగ్గట్లుగానే పనులు వేగంగా జరుగుతున్నాయి.

\-సంతోష్ పాటిల్, గుర్జాల్ గ్రామం

ఎన్నో ఏళ్ల కల సాకారం



కృష్ణా మండలంలో రూ.1.20 కోట్లతో 30 పడకల ఆస్పత్రిని నిర్మిస్తుండడం ఆనందంగా ఉంది. భవన నిర్మాణం పూర్తి కావొస్తుండడంతో ఆస్పత్రిని త్వరలోనే అందుబాటులోకి తెచ్చి మండలవాసులకు అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇక్కడి ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారం అవుతుండడం సంతోషంగా ఉంది.

\-మహాదేవ్, మాజీ సర్పంచ్, కృష్ణా మండలం

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

సాక్షినెట్‌వర్క్: సోదరీసోదరుల ఆత్మీయత, అనురాగానికి ప్రతీకైన రక్షాబంధన్‌ను శనివారం అక్కా తమ్ముడు, అన్నాచెల్లెల్లు ఘనంగా జరుపుకొన్నారు. సోదరీమణులు తమ సోదరులకు బొట్టుపెట్టి, హారతి పట్టి చేతికి రాఖీ కట్టారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



మద్దూర్‌లో సోదరులకు రాఖీ కడుతున్న సోదరీమణులు



నారాయణపేటలోని హంస వాహిని స్కూల్‌లో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

కొడంగల్ అభివృద్ధి బీఆర్ఎస్ ఘనతే

కోస్గి రూరల్: కొడంగల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌దేనని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం కోస్గిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి పేరుతో 20 శాతం కమీషన్‌తో ఆంధ్రా కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై డబుల్‌రోడ్లు వేయిస్తున్నారని ఆరోపించారు. అవినీతిపై ప్రశ్నించే బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయపెట్టిస్తున్నారని విమర్శించారు. నాలుగు రోజుల క్రితం ఢిల్లీలో బీసీల పేరుతో ధర్నా నిర్వహించి నాటకమాడుతున్నారని ఎద్దేవాచేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ పక్షాన బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని దమ్ముంటే కాంగ్రెస్ బీసిలకు ఇస్తానన్న రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించి ఎన్నికలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ శాసం రామకృష్ణ, వెంకట్ నర్సింములు, సాయిలు, జైపాల్ రెడ్డి, వెంకటయ్య, ఉసెనప్ప, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం, నాయకులు

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

నర్వ: మండల కేంద్రానికి బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాఖీ పండుగను పురస్కరించుకొని ప్రయాణికులు చాలా మంది రావడంతో ఆటోలు, ప్రైవేటు వాహనాలే దిక్కయ్యాయని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో నర్వ బస్టాండు కూడలిలో ప్రయాణికులు వేచి చూసి ఇబ్బందులు పడ్డారు. నిత్యం హైదారాబాద్‌కు ప్రత్యేకంగా నర్వ నుంచి ఉదయం సాయంత్రం బస్సులు నడపాలని ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. రవాణాశాఖ అధికారులు స్పందించి బస్సులను వేయాలని కోరుతున్నారు.



బస్సుల కోసం నర్వ బస్టాండులో వేచిచూస్తున్న ప్రయాణికులు

భక్తిశ్రద్ధలతో జల్దిబిందె ఉత్సవాలు



భూనీడులో జల్ది బిందె మహోత్సవం



మద్దూరులో తిరమలేశుని జల్ది ఊరేగింపు

దామరగిద్ద: మండలంలోని దామరగిద్ద, మద్దెల్‌బీడ్, లోకుర్తి తదితర గ్రామాల్లోని కనకరాయ, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక భజనలతో జెల్దిబిందె ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

ఆంజనేయస్వామికి కుంకుమార్చన

కొత్తపల్లి: శ్రావణమాస రెండో శనివారాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని భూనీడు ఆంజనేయస్వామి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి జరిపించారు. ఉత్సవాలలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పాల్గొని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పురుషోత్తం, శివారెడ్డి, మహిపాల్ గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్, రాజురెడ్డి, మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణమాస పూజలు

మద్దూరు: శ్రావణమాస మూడో శనివారాన్ని పురస్కరించుకొని మండలంలో మద్దూరు, చెన్నారెడ్డిపల్లి, చింతల్‌దిన్నె, అప్పిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి, తిరుమలేశుని ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే భారీ ఊరేగింపుతో జల్ది ఉత్సవం నిర్వహించారు. జల్ది సందర్భంగా పలు కురువడోలు కళాకారులు నృత్యాలు చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మినర్సింహా స్వామికి జల్దిబిందె కార్యక్రమం నిర్వహించారు. కృష్ణ నదికి స్వామి వారిని పల్లకిలో కాలినడకన భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

నిండిన చెరువులు.. పొంగిన వాగులు



అలుగు పారుతున్న మరికల్ పెద్ద చెరువు



మల్లెపలిలో వరద నీటిలో వెళ్తున్న గ్రామస్థులు

మరికల్: మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు పొంగిపోర్లడంతో చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. శనివారం కురిసిన భారీ వర్షానికి మరికల్ పెద్ద చెరువుతో పాటు ఇబ్రహీంపట్నం, పెద్దచింతకుంట, అప్పంపల్లి, తీలేర్ చెరువులు పూర్తి స్థాయిలో నిండి అలుగు పారాయి. అలాగే పలు గ్రామాల్లో కాలనీలకు నీళ్లు చేరాడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. చెరువులు అలుగు పారడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాంకోటి సూచించారు.

భారీ వర్షం.. నిలిచిన రాకపోకలు

ఊట్కూర్: మండలంలో శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. మండలంలోని ముక్కన చెరువు అలుగు పారటంతో మల్లెపల్లి, నాగిరెడ్డిపల్లి, సోమవేశ్వర్‌బండ, గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మల్లెపల్లిగ్రామ సమీపంలో లోతట్టు ప్రాంతంలో కల్వర్టు ఉండడంతో కల్వర్టుపై వరద ఉధృతంగా పారుతుంది. దీంతో అధికారులు పలు గ్రామాలకు రాకపోకలు నిలిపేశారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా కల్వర్టు నిర్మాణం చేపట్టి తమ అవస్థలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మంత్రి ఆదేశాలతో ఊర చెరువుకు మరమ్మతు

నర్వ: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి కురిసిన అతిభారీ వర్షాలకు సీపురం గ్రామంలోని ఊర చెరువుకు గండి పడే అవకాశం ఉండడంతో చెరువుకు మరమ్మతు చేశారు. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, ఇరిగేషన్ డీఈ నయిమొద్దీన్, ఇతర అధికారులతో కలిసి చెరువును సందర్శించారు. చెరువు పక్క గ్రామాల నుంచి పొలాల నుంచి వచ్చే నీటితో నిండిపోయిందని గుర్తించారు. చెరువుకు తక్షణమే మరమ్మతు చేపట్టాలని సూచించడంతో జేసీబీతో పనులు ప్రారంభించారు. తక్షణమే స్పందించిన మంత్రి వాకిటి శ్రీహరికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు శరణప్ప, అశోక్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, కురుమూర్తిగౌడ్, ఉమర్‌ఖాన్, గట్టురాములుగౌడ్, రాజాసాబ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.



చెరువుకు మరమ్మతు చేయిస్తున్న అధికారులు